క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు అందించాలి

ములుగు రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను ఆసరగా చేసుకొని డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మకాలు చేపడితే డీలర్లపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు సంబంధించి రశీదులను తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మహాముత్తారం: వచ్చే నెల 8న జిల్లా కేంద్రంలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్సై మహేందర్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోక్‌అదాలత్‌ను మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ లోక్ అదాలత్‌లో వివాద, భూ సమస్యలు తదితర కేసులు రాజీ మార్గంగా పరిష్కరించుకోవచ్చాన్నారు. ఈ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

శాయంపేట : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శాయంపేట, ప్రగతిసింగారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలో రైతుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, తేమ పేరుతో రైతులను ఇబ్బంది గురి చేస్తున్నారని అన్నారు. యూత్ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి, బలవంతుల రాజు, ప్రవీణ్, రైతులు అనిల్, అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడి మృతి


మొండయ్య(ఫైల్)

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ హమాలీ కార్మికుడు మారెపెల్లి మొండయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. సుమారు 43 సంవత్సరాల పాటు నిర్విరామంగా హమాలీ కార్మికుడిగా పని చేసి ఎంతో మందికి ఉపాధిని సైతం కల్పించి హమాలీ కార్మిక వ్యవస్థను బలోపేతం చేశారు. ఆయన మృతితో తోటి హమాలీ కార్మికులు, వ్యాపారస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలిక..

చిట్యాల: మండలంలోని గిద్దెముత్తారం తండా గ్రామానికి చెందిన సిలోతు రియాన్వి(5) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ గొర్రుపై నుంచి పడి మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గిద్దెముత్తారం తండా గ్రామానికి చెందిన రాజ్‌కుమార్–రాధిక కుమార్తె రియాన్వితో కలిసి శుక్రవారం మండలంలోని అందుకుతండా శివారు ఒంటిప్పతండాకు బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఇంటి ముందు ఉన్న ట్రాక్టర్ గొర్రుపై బాలిక ఆడుతుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్రమైన గాయం అయింది. దీంతో హుటాహుటిన భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలిక మృతి చెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్య

చిట్యాల: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వివాహిత బండి మమత(25) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బావుసింగ్ పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన బండి రాజ్‌కుమార్–మమతలకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. కాగా, ఇటీవల భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ కూడా నిర్వహించారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం మమత తన భర్త, పిల్లలతో కలిసి తల్లిగారింటికి చెల్పూర్‌కు పోయారు. అనంతరం శుక్రవారం ఇంటికి వస్తున్న క్రమంలో గొడవ జరుగడంతో ముందుగా వచ్చిన మమత ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. దీంతో గమనించిన భర్త ఇంట్లో నుంచి బయటకు తీసుకువస్తున్న క్రమంలో అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతిరాలి తల్లి మేకల లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు.

బంక్ ఉంది.. స్టాక్ లేదు!

- జీసీసీ ఆధ్వర్యంలో పేరుకే పెట్రోల్ బంక్ ఏర్పాటు
- ఎప్పుడూ నో స్టాక్ బోర్డే దర్శనం..


నోస్టాక్ బోర్డుతో దర్శనమిస్తున్న బంక్(ఫైల్)

కన్నాయిగూడెం: మండలంలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముప్పనపల్లి వద్ద జీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్వహణ లోపం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది. వారంలో సుమారు రెండు రోజులు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దీంతో మండలంలోని ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పెట్రోల్‌కు వచ్చిన వినియోగాదారులు నిరాశతో బ్లాక్‌లో లీటర్‌కు రూ.20 నుంచి రూ.40 అధిక ధరకు అవసరాలను తీర్చుకుంటున్నారు. వ్యవసాయ పనులను రైతులు యంత్రాల ద్వారా సుమారు 15 రోజుల నుంచి ప్రారంభించారు. ఈ సమయంలో డీజిల్ ఎక్కువగా అవసరం ఉంటుంది. మండలంలో బంక్ ఉంది అని రైతులు అనుకున్నప్పటికీ అక్కడా వారంలో రెండు నుంచి మూడు రోజులు నోస్టాక్ బోర్డులు ఏర్పాటు చేయడంతో రైతులు ఏమిచేయాలో తెలియక అందుబాటులో ఉన్న బ్లాక్ మార్కెట్‌లో అధిక రేటుతో కొని సుమారు రోజుకు వెయ్యి నుంచి రెండు వేలు నష్టపోతున్నారు. మండలం నుంచే కాకుండా పలిమెల మండలంలోని కొన్ని గ్రామాల ప్రజలు నో స్టాక్ బోర్డు ఉండడంతో నిరాశ చెంది బ్లాక్‌లో అధిక రేటుకు తీసుకుంటున్నారు. అధికారులు నిర్వహణ పకడ్బందీగా నిర్వహిస్తే ప్రజల అవసరాలతో పాటు సంస్థ లాభదాయకంగా ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

ఎప్పుడు ఉంటుందో తెలియదు..



బంకులో పెట్రోల్ ఎప్పుడు ఉంటుందో తెలియదు. వారంలో రెండు, మూడు రోజులు ఉండదు. పెట్రోల్‌కు పోతే ఒక రోజు ఉంటుంది. మరో రోజు లేక పోవడంతో అందుబాటులో ఉన్న షాపులో ఎక్కువ ధరకు పోసుకొని పోతాం. అధికారులు నిత్యం బంక్‌లో పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచుతే బాగుంటుంది.

– నరెడ్ల అశోక్, మండల యువకుడు

బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం


ములుగు రూరల్: ప్రచారం చేస్తున్న సుధీర్‌యాదవ్


ఏటూరునాగారంలో..

ములుగు రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు గండ్రకోట సుధీర్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మల్లంపల్లి, శ్రీనగర్, దేవనగర్ , రాంచంద్రాపూర్, మహ్మద్ గౌస్‌పల్లిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాంతుడు, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజమొగిలి, రవిందర్, రమస్తష్, దేవేందర్, సంతోష్, ప్రభాకర్, ద్రోణాచారి, మెర్రి రాజుయాదవ్, యువరాజు, శ్రీను, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఏటూరునాగారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాస్ సునీల్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఖాజాపాషా, సప్పిడి రాము, నర్సయ్య, చంద్రబాబు, మోహన్, కుమార్, కిషోర్ ఉన్నారు.

రాకేశ్ రెడ్డిని గెలిపించాలి

భూపాలపల్లి రూరల్: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు ప్రచారం చేశారు. మండలంలోని వివిధ కళాశాలల, పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విద్యావంతుడైన ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని రంగాపూరం గ్రామంలో పార్టీ నాయకులు, పట్టభద్రులు ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాకేష్‌రెడ్డి అధికార పక్షాన్ని ప్రశ్నించే గొంతుక అవుతారని, తీన్మార్ మల్లన్నను గెలిపిస్తే రేవంత్ తొత్తుగా వ్యవహరిస్తారన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించండి


ఎస్ఎస్ తాడ్వాయి: అమ్మవార్లకు పూజలు చేస్తున్న నాయకులు


భూపాలపల్లి అర్బన్: మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఎస్ఎస్‌తాడ్వాయి: పట్టభద్రుల ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ పిలుపునిచ్చారు. జిల్లాలో రెండవ రోజు శుక్రవారం మున్నూరు కాపుల చైతన్య యాత్ర ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య పటేల్, జిల్లా అధ్యక్షుడు పిట్టల మధుసూదన్ పటేల్‌ల ఆధ్వర్యంలో ములుగు, వెంకటాపూరం, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లో చైతన్య యాత్ర నిర్వహించారు. అనంతరం మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి చైతన్య యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుండ దేవయ్య మాట్లాడుతూ.. మేడారంలోని అమ్మవార్ల సన్నిధిలోని మున్నూరు కాపు నిత్యాన్నసత్రం నిర్మిస్తామన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు అశోక్ పటేల్ భవన నిర్మాణం కోసం భూమిని కొనుగోలు చేసి ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సమ్మయ్య పటేల్, అనిశెట్టి రామకృష్ణ, ఐలయ్య, భిక్షపతి, యాదగిరి, సోమయ్య, కోటి, గందె శ్రీను పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్ రెడ్డి, జిల్లా నాయకుడు క్యాతరాజు సాంబమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రెడ్డికాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తూ.. పట్టభద్రులైన ఓటర్లను తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

మల్లన్నను మండలికి పంపాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేనుకుంట్ల కొమురయ్య మాదిగ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రజాగొంతైనా తీన్మార్ మల్లన్నని మండలికి పంపాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవుని స్వామి, రాజేందర్, శనిగరపు రాజయ్య, రేనుకుంట్ల వీరయ్య, జిల్లా మహిళా నాయకురాలు రమా, సులోచన, స్వాతి, జయ పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రావినారాయణరెడ్డి భవన్‌లో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీపీఐ పార్టీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపినట్లు వివరించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పాలి


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పట్టభద్రులు బుద్ధి చెప్పాలని, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ కోరారు. శుక్రవారం ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. సుభాష్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగల రాజేందర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. అందుకే ఆ పార్టీలను ప్రజల అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఆవుల సంతోష్, తాండ్ర హరీష్, అర్జున్, రమేష్,కార్తీక్, రాచకట్ల సందీప్,సతీష్, రవి, శివ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాపూర్‌లో వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఏటూరునాగారం: మండల పరిధిలోని ఇల్లాపూర్‌లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రణీత్ కుమార్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్ రావు, మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


పైడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన బోయిని పైడి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఈకాప్స్ వ్రైటర్ రతీష్ ఐటీకోర్ సహాయంతో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రమోద్‌కుమార్ శుక్రవారం బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి


భిక్ష వడ్డిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: ఆంజనేయస్వామి ఆశీర్వాదంతో ఈ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని బుద్ధారం గ్రామంలోని శ్రీ పర్వత వర్థిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారులకు ఆలయ ధర్మకర్త ఎమ్మెల్యే సత్యనారరయణ రావు, జెడ్పీటీసీ గండ్ర పద్మ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, ఆర్ఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ రాంనర్సింహ రెడ్డి, అశోక్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కళాకారులు ఆటపాటల ప్రదర్శనాల ద్వారా అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారథి రామంచ సురేష్ కళాబృందం కళాకారులు శుక్రవారం మండలంలోని కొడిశాల, లింగాల గ్రామాల్లో ఓటు సద్వినియోగం, ఎండ తీవ్రత, వడదెబ్బపై ఆటపాటలతో ప్రజలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. పట్టభద్రులందరూ ఓటు హక్కును వినియోగించుకొని, ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజాస్వామ్యాన్ని గౌరవించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అధికారుల సూచనలు పాటిస్తూ ఎండ నుంచి రక్షణ పొందాలని, ప్రజలందరూ ఉదయాన్నే పనులు చేసుకుని ఎండ దెబ్బ భారీనపడకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రామంచ సురేష్, రాగుల శంకర్, గోల్కొండ బుచ్చన్న, ఈర్ల సాగర్, మార్త రవి, కనకం రాజేందర్, బోడ కిషన్, ఉప్పుల విజయ్ కుమార్, పాలిపాక తిరుపతి, రెంటాల కుమార్, నరేష్, ఉంద్రాతి భాస్కర్, కామెరదీపక్, మొగిలిచర్ల రాము, శ్రీలత, శోభ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు


రోడ్డు శుభ్రపరుస్తున్న ఏఎస్ఓలు

కాటారం: మండలంలోని గంగారంలో కేంద్ర అసిస్టెంట్ అధికారుల బృందం పర్యటనలో భాగంగా శుక్రవారం గ్రామపంచాయతీ పరిపాలన విధానాలపై ఆరా తీశారు. గ్రామ పంచాయతీని పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలను పర్యావేక్షించారు. శాఖల వారిగా విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా రోడ్లను శుభ్రపర్చి చెత్తాచెదారం తొలిగించారు. ఈ కా ర్యక్రమంలో ఏఎస్ఓలు హిమాన్షు టైలర్, నిషాన్‌సింగ్, నీరజ్‌కుమార్, వివేక్ కుమార్, అరుణ్‌కుమార్, కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ఉన్నారు.

చిటుకు వ్యాధి నివారణ టీకాలు


టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు, గొర్రెలకు శుక్రవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డీవీఏహెచ్ఓ బి.శ్రీదేవి మాట్లాడుతూ.. మూగజీవాల్లో సంక్రమించే జబ్బువాపు, గొంతువాపు నివారణ కోసం ప్రభుత్వం ద్వారా చిటుకు వ్యాధి నివారణ టీకాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. గొంతువాపు టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బస్వాపూర్‌లో 65 పశువులకు, 150 గొర్రెలకు చిటిక వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారులు డాక్టర్ అభిషేక్, డాక్టర్ రాకేశ్‌శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నిటీ అసిస్టెంట్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



వెంకటాపురం(కె): మాట్లాడుతున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(కె): రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని అన్ని విత్తనాలు, పురుగు మందుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుగు మందులు, ఎరువులు విత్తనాల షాపుల యజమానులు షాపు లైసెన్స్, సరైన పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్ తదితరులు ఉన్నారు.

వాజేడులో..

వాజేడు: ఎరువులు, విత్తన దుకాణదారులు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ అన్నారు. వాజేడు పోలీస్ స్టేషన్లో ఎస్సై వెంకటేశ్వరరావుతో కలిసి శుక్రవారం మండలంలోని ఎరువులు, విత్తన దుకాణ దారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారభం అవుతుండటంతో నకిలీ విత్తనాలపై ఆరా తీశారు. నకిలీ విత్తనాలను విక్రయించ వద్దని సూచించారు. లైసెన్స్ పత్రాలు లేకుండా విక్రయాలను జరుపవద్దన్నారు.

మహాముత్తారం: డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొర్లకుంటలో గల హనుమాన్‌సాయి ఎరువులు, పురుగుల మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగి ఉన్న ఎరువుల దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేయాలని ఒరిజినల్ బిల్లులు తీసుకోవాలని సూచించారు. రైతు తప్పని సరిగా బస్తాను తూకం వేయించి తీసుకోవాలని అన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో లైసెన్సు కలిగి ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే ఎరువులు విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు.


మహాముత్తారం: షాప్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

ఎండిన చెట్టు తొలగింపు



మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న ఎండిన వృక్షాన్ని గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ మాట్లాడుతూ.. తాడిచర్ల బీసీ కాలనీ మేయిన్ రోడ్డుపై చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. అకాల వర్షాలకు తోడు రోజు వీస్తున్న ఈదరు గాలులతో చెట్టు విరిగి వాహనదారులపై పడే అవకాశం ఉందని అన్నారు. మండల ప్రత్యేకాధికారి అవినాష్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ ఆదేశాల మేరకు రోడ్డుపై ఉన్న చెట్టును తొలగించినట్లుఆయన వెల్లడించారు.